సాక్షి రంగారెడ్డి

శుక్రవారం ၊ 11 ၊ ఆగస్టు ၊ 2023



కాంగ్రెస్‌తోనే సంక్షేమం

గిరిజనుల సంక్షేమం కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందని పార్టీ నేతలు పేర్కొన్నారు. 8లో▸



ఐక్యతతోనే పరిష్కారం

యాదవులంతా సంఘటితంగా ఉండాలని అఖిల భారత యాదవ మహాసభ నాయకులు పిలుపునిచ్చారు. 8లో▸



సీపీఎస్‌ను రద్దు చేయాలి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

గృహలక్ష్మి పథకానికి గడువు పెంచండి



అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి 20 రోజులు గడువు పొడిగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గురువారం కమిటీ నాయకులు అడిషనల్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.అంజయ్య, కందుకూరి జగన్ మాట్లాడుతూ.. మూడు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రేషన్‌కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడానికే సమయం గడిచిపోతుందన్నారు. కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకున్న వారికి నేటికీ ఇవ్వలేదని గుర్తు చేశారు. రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వద్ద ఉన్న రసీదు ఆధారంగా దరఖాస్తు తీసుకోవాలని కోరారు. 20 రోజులకు గడువు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్యాంసుందర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ కార్యాలయంలో తనిఖీలు



రికార్డులను తనిఖీ చేసి వివరాలను సేకరిస్తున్న అధికారుల బృందం

కందుకూరు: స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో సహకార సంఘం ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టారు. సొసైటీలో జరిగిన లావాదేవీలకు సంబంధించి రికార్డులను గురువారం ఉదయం నుంచి జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ల బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్లు సరస్వతి, సత్యనారాయణరెడ్డి, మాధవరెడ్డితో పాటు ఆడిటర్ రమేష్ తనిఖీల్లో పాల్గొన్నారు. ఎవరెవరికి రుణాలు ఇచ్చారు, చెల్లించిన వడ్డీ, రైతుల పంటల బీమా తదితరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వడ్డీ చెల్లించిన రైతులు కొంతమంది నుంచి మళ్లీ వడ్డీలు వసూలు చేసినట్లుగా, డైరెక్టర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకుండానే తీర్మాన పత్రాలపై సంతకాలు సేకరించినట్లు గ్రహించారు. డైరెక్టర్ల నుంచి రాతపూర్వకంగా వివరణ తీసుకున్నారు. తమకు సమాచారం లేని విషయాలపై వివరణ కోరడంతో కొంత మంది డైరెక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారుల్ని వివరణ కోరగా రికార్డుల్లో నమోదు చేసిన వివరాలను పూర్తిస్థాయిలో కంప్యూటరీకరించలేదని వెల్లడించారు. వాటినే పరిశీలిస్తున్నట్లుగా తెలిపారు.

పంటల వివరాలను పక్కాగా నమోదు చేయాలి



ఏట్ల ఎర్రవల్లిలో పత్తిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

షాబాద్: వానాకాలంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను పక్కాగా నయోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లిలో పంటల నమోదు ప్రక్రియను గురువారం ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు సాగు చేస్తున్న వివరాలు, సర్వే నంబర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఏఈఓలకు సూచించారు.అనంతరం రైతులు సాగు చేసిన పత్తి, వరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశం, ఏఈఓ గీత, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తుల రిమాండ్

శంకర్‌పల్లి: మహిళ ఆత్మహత్యకు కారణమైన వారిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సంతోష్ రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని పర్వేద గ్రామానికి చెందిన లింగమ్మతో పాలివారైన పెంటయ్య, మల్లేశం గొడవ పెట్టుకొని బూతులు తిట్టారు. మనస్తాపానికి గురైన లింగమ్మ ఈ నెల 2న ఆత్మహత్య చేసుకుంది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. నిందితులు పెంటయ్య, మల్లేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎడా పెడా..



సెల్లార్ కోసం చేపడుతున్న తవ్వకాలు

యథేచ్ఛగా సెల్లార్ తవ్వకాలు

- వర్షాకాలం నిషేధం ఉన్నా బేఖాతరు
- భారీ ఎత్తున బ్లాస్టింగులు
- ఎగిరి పడుతున్న బండరాళ్లు
- స్థానికులకు కరువైన కునుకు
- పట్టించుకోని అధికారులు

ఓ నిర్మాణ సంస్థ నల్లగండ్లలో సుమారు 60 అడుగుల లోతు సెల్లార్ నిర్మాణానికి తవ్వకాలు చేపట్టింది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఆ పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ ప్రహరీ కూలింది. హుడా లేఅవుట్‌లో మరో నిర్మాణ సంస్థ సుమారు 20 అడుగుల లోతు సెల్లార్ నిర్మాణానికి తవ్వకాలు చేపట్టింది. దీంతో ఆ పక్కనే ఉన్న మరో అపార్ట్‌మెంట్ ప్రహరీకి పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ హఠాత్ పరిణామంతో ఆ సముదాయంలోని సుమారు 35 కుటుంబాలు రాత్రికి రాత్రే ఇళ్లు ఖాళీ చేసి.. బంధువుల ఇళ్లకు, హోటళ్లకు పరుగులు తీయాల్సి వచ్చింది. ఈ సమస్యపై స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

నాగోల్ – బండ్లగూడ మార్గంలో ఓ నిర్మాణ సంస్థ ఆరెకరాల విస్తీర్ణంలో భారీ సెల్లార్ నిర్మాణానికి తవ్వకం చేపట్టింది. హెచ్ఎండీఏ నుంచి అనుమతులు పొందినా.. తవ్వకాల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. రాత్రి, పగలు తేడా లేకుండా బ్లాస్టింగ్స్ నిర్వహిస్తున్నారు. సామర్థ్యానికి మించి జిలెటిన్ స్టిక్స్ వాడుతుండడంతో పేలుళ్ల ధాటికి పెద్దపెద్ద బండరాళ్లు ఎగిరి వచ్చి పక్కనే ఉన్న ఇళ్లపై పడుతున్నాయి. దీంతో వారికి కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ఇటీవల స్థానికులు ఎస్ఓటీ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఆకాశహర్మ్యాలు, హైరేంజ్ బిల్డింగులకు జిల్లా నిలయంగా మారింది. రాజేంద్రనగర్, కోకాపేట, నార్సింగి, మణికొండ, బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీల పరిధిలోనే కాదు.. ఔటర్ రింగ్ రోడ్డుకు అటుఇటుగా నగరానికి ఆనుకుని ఉన్న తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట్, శంకర్‌పల్లి, శంషాబాద్ మున్సిపాలిటీల పరిధిలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు భారీగా వెలుస్తున్నాయి. ఈ నిర్మాణ సంస్థలు ఐదు నుంచి 50 అంతస్తులకు పైగా భవనాలు నిర్మిస్తున్నాయి. పార్కింగ్ కోసం 30 నుంచి 60 ఫీట్ల లోతు సెల్లార్ల తవ్వకాలు చేపడుతున్నాయి. కొన్ని నిర్మాణ సంస్థలు హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు తీసుకుని తవ్వకాలు చేపడుతుండగా.. మరి కొన్ని గుట్టుగా తవ్వకాలు సాగిస్తున్నాయి. గ్రేటర్ పరిధిలో 218 సెల్లార్ తవ్వకాలు జరుగుతుండగా, వీటిలో 130కి మాత్రమే సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఉన్నట్లు తెలిసింది. మిగిలిన వాటికి ఎలాంటి అనుమతులు లేవు. వీటిలో ఒక్క శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోనే 16 ఉండగా, చందానగర్ పరిధిలో 10, ఎల్బీనగర్‌లో 17 అక్రమ సెల్లార్లు ఉన్నట్లు స్వయంగా అధికారుల పరిశీలనలో తేలింది. సెల్లార్ల తవ్వకాలకు అడ్డుగా ఉన్న బండరాళ్లను తొలగించేందుకు బ్లాస్టింగులు చేపడుతున్నారు. ఇందు కోసం పెద్ద ఎత్తున జిలెటిన్ స్టిక్స్ వాడుతున్నారు. భారీపేలుళ్ల ధాటికి పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్లు, ఇతర నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. అంతేకాకుండా సెల్లార్ తవ్వకాల్లో పని చేస్తున్న కార్మికుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ఓవర్ లోడుతో వాహనాలు

తవ్వకాల్లో వచ్చిన మట్టి, రాళ్లను లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. సామర్థ్యానికి మించిన లోడుతో లారీలు తిరుగుతుండడంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. అసలే వర్షాకాలం ఆపై భారీ వాహనాల రాకపోకలతో రోడ్లపై పెద్దపెద్ద గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. మట్టి, రాళ్ల తరలింపులో కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. వాహనాల వేగానికి రాళ్లు, మట్టి రోడ్లపై పడుతున్నాయి. ఫలితంగా వెనుక నుంచి వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఎల్బీనగర్, నాగోల్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, నాగార్జునసాగర్ మార్గాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సెల్లార్ కోసం తవ్విన మట్టిని విక్రయించాలంటే మైనింగ్ శాఖ నుంచి అనుమతి పొందాలి. రాయల్టీ ఫీజు చెల్లించాలి. కానీ జిల్లాలో ఎక్కడా ఈ విధానం అమలు కావడం లేదు. అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం మండలాల పరిధిలోని ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లోనూ మట్టి మాఫియా రెచ్చిపోతోంది.

నిషేధం ఉన్నా తవ్వకాలు

వానాకాలంలో సెల్లార్ల తవ్వకాలపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. జూలై ఒకటి నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు సెల్లార్ పనులు నిలిపివేయాలని ఆదేశించింది. అయినా అనేక ప్రాంతాల్లో గుట్టుగా తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. నిజానికి సెల్లార్ తవ్వకాలు జరిగే ప్రాంతాల్లో చుట్టూ బారికేడ్లు, రీటైనింగ్ వాల్ నిర్మించాలి. సగం తవ్వి పనులు ఆపేయాల్సి వస్తే వాటిని పూడ్చివేయాలి. చుట్టు పక్క భవనాల భద్రతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన తవ్వకాలను నిలిపివేయాలి. అను మతిలేని సెల్లార్లను మూసివేయాలి. బిల్డింగ్ పర్మిషన్లు రద్దు చేయాలి. వీటిని అమలు చేయాల్సిన స్థానిక సంస్థల అధికారులు, మైనింగ్ శాఖ అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదు. రెవెన్యూ, ఎస్ఓటీ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

- మంత్రి సబితారెడ్డి

కందుకూరు: సీఎం కేసీఆర్ పాలనలో అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని దావూద్‌గూడలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పులిమామిడి బీజేపీ ఎంపీటీసీ రాజమ్మతో పాటు పలువురు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆమె పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ పాలనతో నిత్యావసరాలు, గ్యాస్, పెట్రో, డీజిల్ ధరలు ఆకాశాన్నంటాయని, దీంతో ప్రజలు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారన్నారు. పేదలు మరింత పేదలుగా మారేలా పరిస్థితి ఉందని విమర్శించారు. బీజేపీకి ప్రజల కష్టాలు తెలియవని, కాంగ్రెస్‌కు తెలంగాణలో స్థానమే లేదన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లోకి చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎ.అంజయ్యగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మహిళా అధ్యక్షురాలు ఇందిరాదేవేందర్, పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు ఎస్.లచ్చానాయక్ పాల్గొన్నారు.

మహేశ్వరంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు

మహేశ్వరం: నియోజకవర్గ కేంద్రంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి మంజూరయ్యేలా చూశారని కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుతో కక్షిదారులు, న్యాయవాదులకు మరింత సౌలభ్యం కానుందన్నారు.

బందోస్తు మధ్య దరఖాస్తులు



పోలీసు బందోబస్తు మధ్య గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ

ఇబ్రహీంపట్నం: మహిళా పోలీసుల బందోబస్తు మధ్య గురువారం మొదటిరోజు అధికారులు గృహలక్ష్మి దరఖాస్తులను స్వీకరించారు. మూడు రోజులుగా దరఖాస్తుల స్వీకరణపై గందరగోళం నెలకొన్న సంగతి తెలిసిందే. బుధవారం రాత్రి స్పష్టతో రావడంతో దరఖాస్తులు భారీ సంఖ్యలో వస్తాయన్న అంచనాలతో మండల పరిషత్ కార్యాలయం వద్ద మహిళా పోలీసులతో కాపలా పెట్టారు. గొడవ పడకుండా క్యూలైన్ ఏర్పాటు చేశారు.

ఇటీవలే నిశ్చితార్థం.. ఇంతలోనే విషాదం

- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను బలితీసుకున్న రోడ్డు ప్రమాదం



తరుణ్‌కుమార్ (ఫైల్)

కొత్తూరు: ఉన్నత చదువులు చదివి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కలల కొలువు చేస్తున్నాడు.. వివాహబంధంతో కొత్త జీవితం ప్రారంభించాలనుకున్నాడు.. ఇటీవలే నిశ్చితార్థం సైతం జరిగింది.. ఇంతలోనే విధి చిన్నచూపు చూసింది.. రోడ్డు ప్రమాద రూపంలో బలితీసుకుంది. ఈ విషాదకర సంఘటన కొత్తూరు మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న గోపాల్ తన కుటుంబంతో కలిసి షాద్‌నగర్ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. ఇతడి కుమారుడు తరుణ్‌కుమార్ (29) హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి తన స్కూటీపై షాద్‌నగర్ వైపు వస్తుండగా తిమ్మాపూర్ శివారులో ఎంఆర్ఎఫ్ షోరూం ఎదురుగా నిలిపి ఉంచిన లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తండ్రి అక్కడికి చేరుకుని కుమారుడి మృతదేహం వద్ద బోరున విలపించాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మరో మూడు నెలల్లో పెళ్లి కావాల్సి ఉందని సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసేందుకు వెళ్తూ..



ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- డీసీఎంను ఢీకొట్టిన బొలెరో
- సర్పంచ్ సహా 18 మందికి గాయాలు

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యేను కలిసేందుకు డీసీఎంలో బయలుదేరిన 35 మంది రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వీరిలో 18 మంది గాయపడ్డారు. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం గ్రామానికి చెందిన 35 మంది సర్పంచ్ సంతోష ఆధ్వర్యంలో గురువారం డీసీఎం వాహనంలో ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి బయల్దేరారు. బ్రాహ్మణపల్లి క్రాస్ రోడ్డు, ఏవీఎం కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న బొలేరో.. వీరి వాహనాన్ని ఢీకొట్టింది. డీసీఎం డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడం, బొలేరో ఢీకొట్టడంతో డీసీఎం ఒక్కసారిగా కుదుపునకు గురైంది. వ్యాన్‌లో వెనుకవైపు నిలబడిన వారు అదుపు తప్పి ముందు కూర్చున్నవారిపై పడ్డారు. దీంతో 18 మందికి గాయాలయ్యాయి. వ్యాన్ క్యాబిన్‌లో కూర్చున్న సర్పంచ్ సంతోషినితో పాటు డీసీఎం డ్రైవర్ ఈశ్వర్, అండాలు, అశోక్, లత, పుష్ప, శోభ, శంకర్ తదితరులు గాయపడినవారిలో ఉన్నారు. క్షతగాత్రులను స్థానిక లిమ్స్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఇళ్లకు పంపించారు. సర్పంచ్ మాత్రం ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్ రమేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇబ్రహీంపట్నంలోని లిమ్స్ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ తదితరులు గాయపడిన వారిని కలిసి ధైర్యం చెప్పారు.

గ్రామంలో ఆందోళన

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకంలో తమకు అవకాశం కల్పించాలని కోరేందుకే బాధితులు ఇబ్రహీంపట్నం బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైందనే విషయం తెలియడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. తమ వాళ్లు ఎలా ఉన్నారో తెలుసుకునేందుకు కుటుంబ సభ్యులు ఆత్రుత పడ్డారు. ఎవరికీ పెద్ద ప్రమాదమేమీ లేదని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కాంగ్రెస్ గెలుపును అడ్డుకోలేరు

- రాష్ట్రంలో పార్టీ బలంగా ఉంది
- వచ్చేది మా ప్రభుత్వమే
- ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న మన్సూర్ అలీఖాన్

చేవెళ్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉందని, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీఖాన్ అన్నారు. మండలకేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో గురువారం పార్టీ నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించి సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. కేసీఆర్ తానే తెలంగాణ తెచ్చినట్లు ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని.. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. స్థానికులకే అసెంబ్లీ టికెట్ల విషయమై స్థానిక నాయకులు ప్రస్తావించిన అంశాన్ని ఏఐసీసీ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీని గెలిపించే వరకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

స్థానికులకు కాదంటే ఓడిస్తాం

మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ మాట్లాడుతూ.. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ఏసీఆర్ మళ్లీ పార్టీలోకి వచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని వారికి టికెట్లు ఇస్తే మళ్లీ పార్టీలు మారతారని అన్నారు. ఇక్కడ పార్టీ బలంగా ఉందని.. పార్టీలు మారే వారు వస్తే స్థానికులు, నాయకులు అంగీకరించరన్నారు. వారు వస్తే ఓడిస్తామని, స్థానికులకు అవకాశం ఇస్తే పార్టీని గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎంపీ వినోద్, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, డీసీసీ మాజీ నేత పి.వెంకటస్వామి, పీసీసీ సభ్యులు, డీసీసీ నాయకులు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గెలుపు మాదే..

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గెలుపు కాంగ్రెస్‌దేనని ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీఖాన్ అన్నారు. పట్టణంలోని వి కన్వెన్షన్ హాలులో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జోడో యాత్రను జీర్ణించుకోలేక కుట్ర పన్ని పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేశారని అన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పదేళ్లుగా ప్రజలను మోసానికి గురి చేస్తున్నారన్నారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జి జంగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం నిర్ణయాన్ని గౌరవించాలి

కొత్తూరు: పార్టీ అభ్యర్థుల ఎంపికలో అధిష్టానం తీసుకునే నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని మన్సూర్ అలీఖాన్ సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డితో కలిసి గురువారం కొత్తూరు పట్టణంలో టీపీసీసీ నేత కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నాయకులు విభేదాలు మానుకుని పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అర్హులు ఎంతమంది ఉన్నప్పటికీ అధిష్టానం ఎంపిక చేసిన అభ్యర్థిని గెలిపించడానికి సమన్వయంతో పనిచేయాలన్నా. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.శ్రీనివాస్‌గౌడ్, దినేష్‌సాగర్, మధు, మాదారం నర్సింలుగౌడ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులతో భేటీ

మనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ గురువారం సచివాలయంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులను కలిశారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులకు ప్రొసీడింగ్‌లు ఇవ్వాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే వెంట ఆమనగల్లు వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, వాస్‌దేవ్‌పూర్ ఎంపీటీసీ లచ్చిరాంనాయక్ ఉన్నారు.



సచివాలయం ఆవరణలో ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కార్మిక హక్కులను కాలరాస్తే సహించం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆందోజు రవీంద్రాచారి

హయత్‌నగర్: కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వ కాలరాయాలని చూస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు అన్నారు. జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు గురువారం హయత్‌నగర్‌లో మహాపడావ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను మార్చి కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర చేస్తోందని, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి కార్మికులను రోడ్డున పడేస్తుందని ఆరోపించారు. కార్మిక చట్టాలను రక్షించుకునేందుకు క్విట్ ఇండియా తరహాలో ఉద్యమం చేస్తామన్నారు. కార్మిక చట్టాల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు హరిసింగ్ నాయక్, రమావత్ సక్రూ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెకన్న, దోల రాములు పాల్గొన్నారు.

రెడ్డి భవన్‌కు స్థలం కేటాయించాలి



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రెడ్డి జేఏసీ ప్రతినిధులు

మీర్‌పేట: మహేశ్వరం నియోజకవర్గంలో రెడ్డి సామాజిక వర్గానికి భవన నిర్మాణం కోసం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని గురువారం రెడ్డి జేఏసీ అధ్యక్షుడు బొర్ర సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి భవన నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు సురేందర్‌రెడ్డి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రెడ్డి సంఘం రాష్ట్ర కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, రెడ్డి జేఏసీ ప్రతినిధులు తీగల విక్రంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అరుణ, మాధవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సురేందర్‌రెడ్డి, ఊర్మిళ, గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతోనే గిరిజనుల సంక్షేమం

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి
- ఆదివాసి దినోత్సవం సందర్భంగా తండాలో నిద్ర

మహేశ్వరం: గిరిజనుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఏఐసీసీ ఆదేశాల మేరకు ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని మహేశ్వరం మండలం పడమటి తండాల్లో పర్యటించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకొని అక్కడే నిద్ర చేశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ.. గిరిజన, ఆదివాసుల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. గిరిజన రిజర్వేషన్లు, ఇందిరమ్మ ఇళ్లు, సాగు, పోడు భూములను పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు గెలుపొందిన కేంద్రం, రాష్ట్రంలో అధికారం చేపట్టబోతుందని ఆయన జోస్యం చెప్పారు. అనంతరం గిరిజనులతో సహపంక్తి భోజనం చేశారు.

నాగుల్‌దోని తండాలో..

బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులను అన్ని విధాలా మోసం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నాగుల్‌దోని తండాలో గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనం చేసి అక్కడే నిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు.

కొత్త తండాలో..

మండలంలోని కొత్త తండాలో పీసీసీ జనరల్ సెక్రటరీ, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే గిరిజన తండాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సాగు నీటి ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలో జరిగాయన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్ పాల్గొన్నారు.



కొత్త తండాలో గిరిజన మహిళలతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న పారిజాతరెడ్డి



నాగుల్‌దోని తండాలో సమస్యలు తెలుసుకుంటున్న భాస్కర్‌రెడ్డి

కానిస్టేబుల్‌తో దురుసు ప్రవర్తన: వ్యక్తిపై కేసు

చేవెళ్ల: మద్యం తాగి విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటన మండలంలోని ఆలూరు గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ వీరబ్రహ్మం కథనం మేరకు.. ఆలూరు గ్రామంలో కొందరు మద్యం సేవించి గొడవ పడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి గొడవ పడుతున్న వారిని పంపించారు. రాత్రి పది గంటల సమయంలో కిరాణా షాప్ తెరచి ఉండడంతో బంద్ చేయాలని పోలీసులు ఆదేశించారు. అక్కడే ఉన్న శివరాజ్ అనే వ్యక్తి ఎందుకు బంద్ చేయాలంటూ పోలీసులకు ఎదురు తిరిగారు. పోలీసులు చెబితే బెల్టు షాపులు బంద్ చేయాలా అంటూ గొడవ పడ్డాడు. అంతేకాకుండా విధుల్లో ఉన్న కానిస్టేబుల్ కాలర్ పట్టుకున్నాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో ఈత యువకుడి మృత్యువాత



కృష్ణ కుమార్ శుక్ల మృతదేహం

శంకర్‌పల్లి: పూటుగా మద్యం సేవించి యువకుడు బావిలో ఈత కొట్టేందుకు దిగి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని మిర్జాగూడ గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని పురానాపూల్, రహీంపుర ప్రాంతానికి చెందిన కృష్ణకుమార్ శుక్ల(26) గోల్ఫ్ క్లబ్‌లో పని చేసున్నాడు. బుధవారం మధ్యాహ్నం కృష్ణ మరో ముగ్గురు స్నేహితులు మిర్జాగూడ శివారులో మద్యం సేవించారు. సాయంత్రం సమీపంలోని బావిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. బావిలోకి దిగిన నలుగురిలో ముగ్గురు ఒడ్డుకు చేరుకోగా కృష్ణ కుమార్ శుక్ల బయటి రాలేదు. దీంతో స్నేహితులు కంగారు పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఫలితం లేకపోవడంతో బుధవారం రాత్రి మోకిల పోలీసులకు సమాచారం ఇచ్చారు. గురువారం ఉదయం పోలీసులు గజ ఈతగాళ్లతో బావిలో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



యాదమ్మ(ఫైల్)

కుల్కచర్ల: పొలానికి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన కులకచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చౌడాపూర్ మండలం లింగంపల్లికి చెందిన మేకల యాదమ్మ(42) ఈ నెల 7న పొలానికి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారు. ఫలితం లేకపోవడంతో ఆమె కుమారుడు వెంకటేష్ కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

- బాలుడి మృతి, మరొకరికి గాయాలు



సాయి(ఫైల్)

కడ్తాల్: శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై తలకొండపల్లి సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందగా, మరో బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని గానుగుమార్లతండాకు చెందిన జాటవత్ లక్ష్మణ్–లక్ష్మీ దంపతుల కుమారుడు జాటవత్ సాయి(12), ముడావత్ అఖిల్ ఇద్దరూ స్నేహితులు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో సాయి 5వ తరగతి చదువుతున్నాడు. రోజూ పాఠశాలకు వచ్చి తిరిగి తండాకు వెళ్తుంటాడు. గురువారం రాత్రి అఖిల్, సాయి ఇద్దరూ కలిసి వ్యక్తిగత పనిమీద తండా నుంచి బైక్‌పై మైసిగండికి వెళ్తుండగా.. మార్గమధ్యలో తలకొండపల్లి కూడలి సమీపంలో యూటర్న్ తీసుకుంటున్న టిప్పర్ వాహనం ఎలాంటి ఇండికేటర్ వేయకుండా బైక్‌ను ఢీక్కొటింది. ఈ ప్రమాదంలో సాయి సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, అఖిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అఖిల్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు.

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం



అనిల్‌కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న జగదీశ్

- యాదవులు రాజకీయంగా ఎదగాలి
- సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీశ్ యాదవ్

ఇబ్రహీంపట్నం: యాదవులంతా సంఘటితంగా ఉండాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు జగదీశ్ యాదవ్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో గురువారం జరిగిన యాదవుల ముఖ్య నేతల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. యాదవులంతా సంఘటితంగా ఉంటేనే సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమ నాయకురాలు గానకోకిల బెల్లి లలిత జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. అనంతరం యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్ అనిల్‌కుమార్ యాదవ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు జగదీశ్‌యాదవ్ పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లేష్, రఘునాథ్, కృష్ణ, వెంకటేశ్, శ్రీరామ్ యాదవ్, బాల్‌రాజ్, బీ వెంకటేశ్, మహేశ్, శ్రీనివాస్, రామకృష్ణ, చందు తదితరులు పాల్గొన్నారు.

డాడీ.. వెళ్లిపోతున్నా..

- తండ్రి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన కొడుకు
- బయటకు వెళ్లి బతుకుతానని లెటర్



జ్ఞానేశ్వర్(ఫైల్)

పహాడీషరీఫ్: తండ్రి మందలించాడని ఓ కొడుకు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పోతూ పోతూ ఇంటి డోర్‌కు లెటర్ అతికించి వెళ్లాడు. అందులో.. 'డాడీ నేను ఇంట్లో నుంచి వెళ్లి పోతున్నా.. నువ్వేకదా నన్ను వెళ్లిపోమన్నావు.. నేను బయటికి వెళ్లి బతుకుతా.. డాడీ' అంటూ లెటర్ రాసి డోర్‌కు అతికించాడు.. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిపల్లి రంగనాయకుల కాలనీకి చెందిన కృష్ణ కుమారుడు జ్ఞానేశ్వర్(20). ఇంటర్ వరకు చదివి ఏ పని చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ విషయమై తండ్రి మందలించాడు. ఈ నెల 8వ తేదీ ఉదయం వస్త్రాలు సర్దుకొని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. వెళ్తూ వెళ్తూ లెటర్ రాసి డోర్‌కి పెట్టాడు. దీన్ని గమనించిన తండ్రి కొడుకు కోసం పలుచోట్ల గాలించాడు. ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జ్ఞానేశ్వర్ ఆచూకీ తెలిస్తే పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్, లేదా సెల్ నంబర్ 87126 62367కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

అమరవీరులను స్మరించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

- బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి

మీర్‌పేట: స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను ప్రతి పౌరుడు స్మరించుకోవాలని సింగిల్ విండో మాజీ చైర్మన్, బీజేపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ కొలన్ శంకర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆజాదిక అమృత్ మహోత్సవంలో మన దేశం - మన మట్టి కార్యక్రమంలో భాగంగా దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరిస్తూ మట్టిని పూజించాలన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో స్వాతంత్ర్య సమర యోధులను, అమరవీరుల కుటుంబాలను గుర్తించి సత్కరిస్తామన్నారు. అదే విధంగా 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని, 16 నుంచి 20వ తేదీ వరకు ప్రతి గ్రామంలో మట్టిని తీసుకొని దేవాలయాల్లో పూజించి ర్యాలీలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. అమరుల త్యాగ ఫలాలను అందరికీ అందించేందుకే అమృత త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. సమావేశంలో మీర్‌పేట కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు నర్సింహ, పార్టీ ఫ్లోర్ లీడర్ గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్, నాయకులు ప్రభాకర్, యాదగిరి యాదవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న టీపీయూఎస్ నాయకులు

- ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి
- కలెక్టరేట్ ఎదుట టీపీయూఎస్ ధర్నా

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించి సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి డిమాండ్ చేశారు. టీపీయూఎస్, రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 317 వల్ల స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వెంటనే స్థానిక జిల్లాలో తిరిగి నియమించాలన్నారు. అనంతరం టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్నామన్నారు. ఈ నెల 19వ తేదీన మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాశీరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, ఏబీఆర్ఎస్ఎం నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీ కోసం సిమ్ స్వాపింగ్!

- కొత్త ఎత్తులు వేస్తున్న సైబర్ నేరగాళ్లు
- కస్టమరే తమ సిమ్‌ను బ్లాక్ చేసేలా వ్యూహం
- అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు

సాక్షి, సిటీబ్యూరో: బ్యాంకుల కాల్ సెంటర్ల మాదిరిగా ఫోన్లు చేస్తూ వ్యక్తిగత సమాచారం తెలుసుకుని ఆన్‌లైన్‌లో అందినకాడికి కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తున్నారు. అనేక వివరాలు చెప్పినా... వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) చెప్పని వినియోగదారుల్ని 'సిమ్ స్వాపింగ్'తో బురిడీ కొట్టిస్తున్నారు. వినియోగిస్తున్న సిమ్‌కార్డుల్ని వారితోనే బ్లాక్ చేయిస్తూ తమ 'పని' పూర్తి చేసుకుంటున్నారు. ఈ తరహా నేరాలు తరచుగా చోటు చేసుకుంటున్నాయి.

ఇప్పటి వరకు ఈ రకంగా దోచారు...

బ్యాంకుల పేర్లతో ఫోన్లు చేసి ఖాతాలు ఖాళీ చేసే నేరాలు జోరుగా సాగుతున్నాయి. జమ్‌తార, ఢిల్లీ కేంద్రాలుగా సూత్రధారులు వ్యవస్థీకృతంగా ఈ నేరాలు చేస్తున్నారు. ప్రత్యేక కాల్ సెంటర్ల నుంచి తమ ఉద్యోగులతో బ్యాంకు ఖాతాదారులకు ఫోన్లు చేయిస్తుంటారు. తాము ఫలానా బ్యాంక్ కాల్ సెంటర్ నుంచి మాట్లాడుతున్నామంటూ పరిచయం చేసుకునే నేరగాళ్లు క్రెడిట్/డెబిట్ కార్డ్‌ను అప్‌గ్రేడ్, ఆధార్, పాన్ లింకేజ్, కేవైసీ అప్‌డేట్ అని చెప్తూ వినియోగదారుల నుంచి కార్డ్, పిన్ నెంబర్లతో పాటు ఓటీపీ సైతం తీసుకుంటున్నారు. ఆపై ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా వారి ఖాతాల్లో ఉన్న నగదు స్వాహా చేయడం, ఈ–కామర్స్ సైట్స్‌లో ఖరీదు చేయడం, ఈ–వ్యాలెట్స్‌లోకి బదిలీ చేసుకోవడం చేసి మోసం చేస్తున్నారు.

డేటా వివిధ మార్గాల్లో సంగ్రహణ...

వివిధ బ్యాంకులకు చెందిన డెబిట్/క్రెడిట్ కార్డుల వినియోగదారుల డేటాను సైబర్ నేరగాళ్లు అనేక మార్గాల్లో చేజిక్కించుకుంటున్నారు. ఆయా బ్యాంకులకు చెందిన కాల్ సెంటర్ల ద్వారా కార్డు నెంబర్, వినియోగదారుడి పేరు ఇతర వివరాలతో పాటు కొన్ని సందర్భాల్లో సీవీవీ కోడ్స్ కూడా వీరికి అందుతున్నాయి. ఖాతాల్లో ఉన్న నగదు కాజేయడానికి ఓటీపీ తప్పనిసరి. బ్యాంకుల పేరుతో కాల్స్ చేస్తున్న కేటుగాళ్ళకు బాధితులు అనేక వివరాలూ చెప్పున్నప్పటికీ... ఓటీపీ దగ్గరకు వచ్చేసరికి మాత్రం అనుమానిస్తున్నారు. దీంతో ఆ నెంబర్ చెప్పకుండా ఫోన్లు కట్ చేస్తున్నారు. ఈ రకంగా తాము 'నష్టపోతున్నామనే' ఉద్దేశంతో సైబర్ నేరగాళ్లు ఇటీవల వేసిన ఎత్తుగడే సిమ్ స్వాపింగ్.

ఏకంగా కొత్త సిమ్ కార్డుల్ని..

సిమ్ స్వాపింగ్ కోసం సైబర్ నేరగాళ్ళు ఉత్తరాదికి చెందిన కొన్ని సిమ్‌కార్డుల విక్రయ కేంద్రాలతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఎలాంటి గుర్తింపుకార్డులు సమర్పించకుండానే వారి వద్ద నుంచి టార్గెట్ చేసిన వినియోగదారుడి సెల్ నెంబర్‌తోనే మరో సిమ్‌కార్డు తీసుకుంటున్నారు. ఇది యాక్టివేట్ కావాలంటే అసలు వినియోగదారుడు అప్పటికే వినియోగిస్తున్న సిమ్ నుంచి కొత్త సిమ్‌పై ఉన్న నెంబర్లను సర్వీస్ ప్రొవైడర్‌కు ఎస్సెమ్మెస్ చేయాల్సి ఉంటుంది. అలా చేసిన తర్వాత మాత్రమే కొత్త సిమ్ యాక్టివేట్ కావడంతో పాటు పాత సిమ్ బ్లాక్ అవుతుంది. సరిగ్గా ఇదే విధానాన్ని సైబర్ నేరగాళ్ళు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. 'మీ సిమ్ బ్లాక్/డ్యామేజ్ అయింది. ఇబ్బందులు సరిదిద్దడానికి మీ సెల్‌కు వచ్చే నెంబర్‌కు ఫలానా నెంబర్ ద్వారా సర్వీస్ ప్రొవైడర్‌కు పంపండి' అంటూ వివిధ నెంబర్ల నుంచి వినియోగదారులకు సర్వీస్ ప్రొవైడర్ల మాదిరిగా సిమ్ కలిగిన వ్యక్తికి ఎస్సెమ్మెస్‌లు పంపిస్తున్నారు.